క్లుప్తంగా

వెంకన్నకు పుష్పాలంకరణ


పూజలందుకుంటున్న స్వామివారు

శ్రీకాకుళం కల్చరల్: చిన్న బజారులోని దూదివారి వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో స్వామికి **అష్టోత్తర శతనామాలతో** అర్చనలు చేశారు. **అధిక భక్తులు** తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఈఓ మాధవి భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు.

ఘనంగా విగ్రహాల ప్రతిష్టాపన


పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని బొందిలీపురం సాయి దర్బార్ మందిరం వద్ద దత్త గురు పరంపర ధ్యాన మందిరంలో గురువుల విగ్రహాలను శనివారం ఘనంగా ప్రతిష్టించారు. అర్చకులు సంతోష్ బ్రహ్మ, సురేష్ బ్రహ్మల ఆధ్వర్యంలో దత్తాత్రేయుడు, శ్రీపాద వల్లభుడు, శ్రీనృసింహ సరస్వతి, మాణిక్ ప్రభు, అక్కల్ కోట్ మహారాజ్‌ల విగ్రహాలకు పూజలు చేసి ప్రతిష్టాపన కార్యక్రమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రీసర్వే దిద్దుబాట్లుపై గ్రామసభలు


రైతులతో మాట్లాడుతున్న అధికారులు

గార: జగనన్న శాశ్వత భూహక్కు– భూరక్షలో భాగంగా రీసర్వే జరిగిన ప్రాంతాల్లో రికార్డుల్లో దిద్దుబాట్లుకు గ్రామసభలు నిర్వహిస్తున్నామని డిప్యూటీ తహశీల్దార్ సీహెచ్ జీవీవీ ప్రసాద రావు అన్నారు. శనివారం రామచంద్రాపురం సచివాలయంలో రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధార్, ఫోన్ నంబరు, పేరు, సర్వే నంబరు, ఫోటో మార్పు వంటి 14 అంశాలపై దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. 10 నుంచి మార్పులు చేస్తామన్నారు. సమావేశంలో సర్పంచ్ గొలివి వెంకటరమణమూర్తి, ఎంపీటీసీ రుప్ప శ్రీనివాసరావు, అంబటి చిన బాబు, వీఆర్వో చక్రవర్తి, పంచాయతీ కార్యదర్శి రాము పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నేరం


మాట్లాడుతున్న ఏపీఎం రామ్మూర్తి

ఎచ్చెర్ల: బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యతని వెలుగు ఏపీఎం రామ్మూర్తి అన్నారు. విజన్ బిల్డింగ్ ట్రైనింగ్‌లో భాగంగా ఈసీ సభ్యులు, ఐసీపీఎస్ సభ్యులు శనివారం బాల్య వివాహాలు, నష్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని చెప్పారు. కార్యక్రమంలో ఎం.మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సంతోషిమాతకు జన్మనక్షత్ర పూజలు



శ్రీకాకుళం కల్చరల్: పాత శ్రీకాకుళంలోని సంతోషిమాత ఆలయంలో అమ్మవారి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రం సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు మోదుకూరి కిరణ్‌శర్మ నేతృత్వంలో మూలవిరాట్టుకు అభిషేకాలు చేశారు. అమ్మవారిని పూలతో అలంకరించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సిబ్బంది విధుల్లో చేరాలి

రణస్థలం: లావేరు, రణస్థలం మండలాల పరిధిలోని 234 అంగన్‌వాడీ కేంద్రాల్లో 435 మంది కార్యకర్తలు, ఆయాలు, మినీ కార్యకర్తలు సోమవారం విధుల్లో చేరాలని రణస్థలం స్త్రీ–శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ అధికారి సీహెచ్ ఝాన్సీబాయ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అనుమతులు లేకుండా సమ్మె చేస్తున్నారని, ఈ నెల 8 నుంచి విధుల్లో చేరని పక్షంలో నోటీసులు జారీ చేస్తామని పేర్కొన్నారు. ఆపై కూడా చేరకపోతే జీవో నంబర్–2 ప్రకారం విధుల నుంచి తొలగిస్తామని స్పష్టం చేశారు.

అభివృద్ధి పథంలో అర్జునవలస


అర్జునవలస గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, గ్రామీణ ఆరోగ్య కేంద్రం



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గ్రామాల రూపురేఖలు మారిపోయాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా పనిచేస్తుండడంతో అన్ని సదుపాయాలు ఇంటి వద్దనే అందుతున్నాయి. సచివాలయ, వలంటీర్ వ్యవస్థతో ప్రభుత్వమే ప్రజల వద్దకు వచ్చింది. రైతు భరోసా కేంద్రాలతో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు తదితర వస్తువులు ఊరులోనే లభిస్తున్నాయి. నాడు–నేడు పథకంతో పాఠశాలలు, పీహెచ్‌సీలు కార్పొరేట్ లుక్‌ని సొంతం చేసుకున్నాయి. దీంతో గ్రామీణ ప్రాంతాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

– రణస్థలం

- ప్రతి వీధిలో అభివృద్ధి జాడలు
- ఇంటింటా సంక్షేమ ఫలాలు
- అన్నివర్గాల ప్రజల్లో హర్షం

రణస్థలం మండలానికి శివారు పంచాయతీ అర్జునవలస. సుమారు 2 వేలకు పైగా జనాభా ఉంటారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పంచాయతీలోని గిరివానిపాలెం, గిడిజాలపేట, అర్జునవలస రూపురేఖలు మారిపోయాయి. అన్నీ గ్రామాలకు అందుబాటులో రోడ్డు పక్కనే గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, గ్రామీణ ఆరోగ్య కేంద్రం నిర్మించారు. అలాగే వెటర్నరీ అసిస్టెంట్ గ్రామంలోనే పశువులకు వైద్యం అందిస్తున్నారు. విద్యార్థులు, రైతులు, వివిధ వర్గాల వారికి సచివాలయంలోనే అన్ని పనులు జరుగుతున్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సచివాలయం పరిధిలో లబ్ధిదారులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు రూ.12 కోట్ల లబ్ధి చేకూరింది.

అభివృద్ధి పనులు	
గ్రామ సచివాలయం నిర్మాణానికి	రూ.40 లక్షలు
సీసీ రోడ్లు, కాలువల నిర్మాణానికి	రూ.20 లక్షలు
రైతు భరోసా కేంద్రం	రూ.22 లక్షలు
వైఎస్సార్ గ్రామీణ ఆరోగ్య కేంద్రం	రూ.17.50 లక్షలు
పాఠశాల అభివృద్ధికి	రూ.80 లక్షలు
జలజీవన్ మిషన్	రూ.40 లక్షలు


గ్రావెల్ రోడ్డు (ఫైల్)
నాడు


నేడు
గ్రామంలోని సీసీ రోడ్డు



నా పేరు యళ్లగాన శాంతమ్మ. మాది అర్జునవలస గ్రామం. మా గ్రామంలో జగనన్న ప్రభుత్వం వచ్చిన తర్వాత చాలా అభివృద్ధి కనిపిస్తోంది. ఒకప్పుడు ఎటువంటి ప్రభుత్వ సేవలు కావాలన్నా రణస్థలం మండల కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేది. కానీ ఇప్పుడు ఏ పని ఉన్నా సచివాలయంలోనే జరిగిపోతోంది. వలంటీర్‌కు సమాచారం ఇస్తే దగ్గరుండి పనులన్నీ చేయిస్తున్నారు. సంక్షేమ పథకాలు సైతం ఇంటి వద్దకే వచ్చి అందజేస్తున్నారు. జగనన్న ప్రభుత్వ పనితీరు బాగుంది.

గ్రామం మారింది



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్జునవలస పంచాయతీ మార్పు చెందింది. గతంలో కూడా సర్పంచ్‌గా పని చేశాను. కానీ అప్పుడు గ్రామానికి రోడ్లు, కాలువలు మంజూరు చేయలేదు. ప్రస్తుత ప్రభుత్వంలో అన్నీ పనులూ చేసుకోగలిగాం. అభివృద్ధి పథంలో అర్జునవలస నడుస్తున్నందుకు ఆనందంగా ఉంది.

– మీసాల లక్ష్మీరామునాయుడు, గ్రామ సర్పంచ్

ఇంటికి వచ్చి పింఛన్ ఇస్తున్నారు



గతంలో ఉన్న ప్రభుత్వాలు ఇంటికి వచ్చి పింఛన్ ఇవ్వడం ఎన్నడూ జరగలేదు. కానీ ఇప్పుడు ఒకటో తేదీనే వలంటీర్ వచ్చి పింఛన్ అందజేస్తున్నాడు. అలాగే రైతులకు ఎరువులు, పురుగు మందులు అన్నీ ఊర్లోనే దొరకుతున్నాయి. గతంలో ఏది కావాలన్నా రణస్థలం వెళ్లాల్సి ఉండేది. ఉదయం వెళ్తే సాయింత్రం వచ్చేవాళ్లం. జగన్ బాబు పరిపాలనలో గ్రామంలోని రోడ్లు, కాలువలు, బడులు బాగుపడ్డాయి.

– వై.అసిరయ్య, అర్జునవలస గ్రామస్తుడు

పింఛన్లతో సామాజిక భద్రత


శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): పింఛన్ల పంపిణీలో మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు


శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): అరసవల్లిలో పెన్షన్లు అందిస్తున్న చైర్మన్ సూరిబాబు


శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): పెన్షన్ల పెంపు పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు


జి.సిగడాం: వాండ్రంగిలో పింఛన్లు పంపిణీ చేస్తున్న సాకేటి నాగరాజు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): వృద్ధాప్యంలో ఉన్న వారికి సామాజిక పింఛన్లు ఆర్థిక భరోసాతో పాటు సామాజిక భద్రత కల్పిస్తాయని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీని కార్యక్రమాన్ని బలగలో శనివారం నిర్వహించారు. 8 డివిజన్లకు చెందిన లబ్ధిదారులకు మంత్రి చేతుల మీదుగా పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పాదయాత్రలో ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్నవారికి అధికారం ఇస్తారా..? హామీలను గాలికొదిలేసిన చంద్రబాబు వంటి మోసకారికి అధికారం ఇస్తారా? అని ప్రశ్నించారు. ఇవాళ మూడు వేల రూపాయలు పెన్షన్ అందుకుంటున్న అవ్వాతాతలు ఎంతో ఆనందంగా ఉన్నారు. సంక్షేమ ప్రభుత్వానికి మీరంతా తోడుగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో కమిషనర్ చల్లా ఓబులేసు, ఎంపీపీ అంబటి నిర్మల శ్రీనివాస్, పార్టీ నగర అధ్యక్షుడు సాదు వైకుంఠరావు, వైఎస్సార్ సీపీ నాయకులు బలగ గణపతి పట్నాయక్, చల్లా శ్రీనివాసరావు, ఆలుగుబెల్లి నాగభూషణరావు, సాధు నాగు, టంకాల బాలకృష్ణ, ఎండ రమేష్, వానపల్లి రమేష్, ఆబోతుల రామ్మోహన్‌రావు, జ్యోతి, మోహన్, బలగ సాయికిరణ్, పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం (పీఎస్‌కాలనీ): ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ, విశ్వసనీయతను చాటుకుంటూ వైఎస్సార్ పింఛన్ కానుక మూడు వేలకు పెంచి అవ్వాతాతలకు అండగా నిలిచిన ఆదర్శ ముఖ్యమంత్రి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు అన్నారు. అరసవల్లి సచివాలయం పరిధిలో శనివారం వైఎస్ఆర్ పింఛన్ కానుక పంపిణీ చేశారు. కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జి జేఎం శ్రీనివాస్, తెలుగు రమేష్, ధర్మాన రఘునాథమూర్తి, శ్రీనివాసరావు, అడ్మిన్ సెక్రటరీ సీహెచ్ సుశీల, సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీ ధర్మాన వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

ఎచ్చెర్ల: లావేరు మండలం పెద్దలింగాలవలసలో వైఎస్సార్ సీపీ నేత లుకలాపు అప్పలనాయుడు పింఛన్లు పంపిణీ చేశారు.

జి.సిగడాం: మండలంలో వాండ్రంగి సచివాలయం వద్ద జిల్లా దళిత ఐక్యత వేదిక అధ్యక్షుడు, సర్పంచ్ సాకేటి నాగరాజు పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ డబ్బాడ రామారావు, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): నగరంలోని ఏడురోడ్ల కూడలి సచివాలయ పరిధిలో వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి మండవల్లి రవి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి.పద్మావతి వైఎస్సార్ పెన్షన్ కానుక పోస్టర్‌ను ఆవిష్కరించారు. పార్టీ నాయకులు భైరి మురళి, సచివాలయ అడ్మిన్ భారతి, వెల్ఫేర్ అసిస్టెంట్ శ్రీరామ్, వలంటీర్లు పాల్గొన్నారు.


రిమ్స్‌లో వృద్ధురాలు సూరమ్మకు పింఛన్ పంపిణీ చేస్తున్న వలంటీర్ జయలక్ష్మి


శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): రిమ్స్‌లో డయాలసిస్ రోగికి పింఛన్ అందిస్తున్న వలంటీర్ మీనాక్షి

వివాదాస్పద స్థలం కంచె మాయం


విరిగిన స్తంభాలను పరిశీలిస్తున్న అధికారులు


రణస్థలం: మండల కేంద్రంలో సీఐ కార్యాలయం వెనుక సర్వే నెంబర్ 2–1లో 13 సెంట్ల వివాదాస్పద స్థలంలో ఇటీవల అధికారులు వేసిన కంచె(సిమెంట్ స్తంభాలను)ను గుర్తు తెలియని వ్యక్తులు విరగ్గొట్టారని జె.ఆర్.పురం పంచాయతీ రెవెన్యూ అధికారి వై.జగన్నాథం, పంచాయతీ అధికారి లింగాల ఆదినారాయణ తెలిపారు. శనివారం వివాదాస్పద స్థలాన్ని పరిశీలించారు. స్థలం యాజమాన్య హక్కుల వివాదం హైకోర్టులో పెండింగ్‌లో ఉన్నందున తీర్పు వెలువడే వరకు ఎటువంటి నిర్మాణాలు, ఆక్రమణలు చేపట్టరాదని మూడు నెలల క్రితం నోటీస్ బోర్డు ఏర్పాటు చేశామని చెప్పారు. ఇటీవల తహసీల్దార్ సనపల కిరణ్‌కుమార్, జె.ఆర్.పురం ఎస్సై రాజేష్ సమక్షంలో సిమెంట్ స్తంభాలతో కంచె ఏర్పాటు చేశామన్నారు. ఈ నెల 3న రాత్రి సమయంలో ఈ స్తంభాలను విరగ్గొట్టారని, దుండగులను గుర్తించి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం


రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ చిరంజీవి

ఎచ్చెర్ల: మండలంలోని ధర్మవరంలో పంచాయతీ నిధులు రూ.4 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు, కాలువ పనులను ఎంపీపీ మొదలవలస చిరంజీవి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మండల విప్ బగ్గు రాజారావు, నాయకుల రుప్ప సన్యాసిరావు, ఒుక్క సురేష్, యండ ముసలినాయుడు, సేతింటి రమణ, బాన్న తవుడు, బసవ లక్ష్మణ్, వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గణేష్ గురూజీకి ఆహ్వానం


గురూజీకి ఆహ్వానం అందిస్తున్న వీహెచ్‌పీ సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: బలగ నాగావళి తీరంలో ఉన్న బాలాత్రిపుర కాలభైరవ పీఠం దేవాలయం వ్యవస్థాపకులు గణేష్ గురూజీకి అయోధ్యలో ఈ నెల 22న జరగనున్న బాలముని ప్రతిష్ట కార్యక్రమానికి విశ్వహిందూ పరిషత్ జిల్లా సభ్యులు ఆహ్వానం అందించారు. దేశవ్యాప్తంగా ఆరు వేల మంది స్వామీజీలు హాజరవుతున్న సందర్భంగా గణేష్‌గురూజీ, శ్రీనివాసానంద సరస్వతి స్వామీజీలకు కూడా ఆహ్వానం అందింది. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు లోకనాథం ఆనందరావు, కార్యదర్శి శ్రీరంగం మధుసూదనరావు, ఉపాధ్యక్షులు గొడ్డు భాస్కర్, భజరంగ్ దళ్ జిల్లా సంయోజక్ రావాడ రాజశేఖర్, పీఠం అధ్యక్షుడు రెడ్డి గిరిజాశంకర్, కార్యదర్శి సాధు రామారావు, ఉపాధ్యక్షులు ఆర్కె బాబు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలేకు నివాళులు


సావిత్రిబాయి పూలే చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఉపాధ్యాయులు

రణస్థలం: మహిళలకు చదువు అవకాశం లేని రోజుల్లో పితృస్వామ్య వ్యవస్థను ధిక్కరించి తాను చదువుకుని అట్టడుగు వర్గాల మహిళలకు చదువు నేర్పిన మహోన్నత వ్యక్తి సావిత్రిబాయి పూలే అని ఎంఈఓ అల్లాడ త్రినాథ రావు అన్నారు. జె.ఆర్.పురం ప్రాథమికోన్నత పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంత్యుత్సవం శనివారం నిర్వహించారు. అనంతరం ఉపాధ్యాయునులను సన్మానించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్షుడు రామారావు, జిల్లా కోశాధికారి రవికుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యతోనే సమాజంలో మార్పు



కళాశాల నూతన భవనాల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు


బీటీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

- రాష్ట్ర రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు

గార: విద్యతోనే సమాజంలో మార్పు సాధ్యమవుతుందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శనివారం కళింగపట్నంలోని కోకా వారి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రూ.2.26 కోట్లతో నిర్మించిన భవనాలు, కె.మత్స్యలేశం, పూసర్లపాడు గ్రామాల్లో ఒక్కోచోట రూ.21.80 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాల భవనాలను, బందరువానిపేట నుంచి కళింగపట్నం వరకు బీటీ రోడ్డు పనులను మంత్రి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజాన్ని మార్చేందుకు. అంతరాలు తగ్గించేందుకు విద్య ఒక్కటే మార్గమని చెప్పారు. అందుకే పెద్ద ఎత్తున నిధులు కేటాయించామని తెలిపారు. విశాల దృక్పథం, దూరదృష్టి కలిగిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, ఆయన ఆలోచనల మేరకు పాలనసంబంధ సంస్కరణలు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ క్రమంలో కొన్ని విమర్శలు వస్తాయని, అయినా నేరుగా ఫలానా విషయంలో తప్పు చేశారని ప్రతిపక్షాలు చెప్పలేకపోతున్నాయన్నారు. కె. మత్స్యలేశంలో ఇప్పుడు జరిగిన అభివృద్ధి 75 ఏళ్లలో ఎప్పుడైనా చూశారా అని ప్రశ్నించారు. సచివాలయం, ఆర్బీకే, పీహెచ్‌సీ, బీచ్‌కు పూర్వవైభవం, అధునాతన పాఠశాలలు, కళాశాలకు నూతన భవనాలు ఇవేమీ అభివృద్ధి కాదా అని ప్రశ్నించారు. తప్పుడు రాతలు రాయడం, రాయించడం కొందరి సిద్ధాంతమని విమర్శించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, ఎంపీపీ గొండు రఘురాం, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ పీస గోపి, తరవల రామకృష్ణ, రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ ముంజేటి కృష్ణమూర్తి, మళ్ల నారాయణమూర్తి, జల్లు గౌరపతి నాయుడు, సర్పంచ్ బి.లలిత, జి.లక్ష్మీ, ఎంపీటీసీ చంద్రమతి, మార్పు పృథ్వీరాజ్, పీస శ్రీహరిరావు, కొయ్యాన నాగభూషణం, శిమ్మ ధర్మరాజు, బి.ఎర్రన్న, కెప్టెన్ ఎర్రన్న, జి.రామారావు, కళాశాల ప్రిన్సిపాల్ బి.అప్పలరాజు, సుగ్గు మధురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం


సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి బాబు

జి.సిగడాం: విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని రాజాం సీనియర్ సివిల్ జడ్జి ఎం.బాబు అన్నారు. శనివారం జి.సిగడాం మోడల్ స్కూల్లో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పట్టుదలతో చదివి ఉన్నత స్థానాలను అధిరోహించాలని, వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. జూనియర్ సివిల్ జడ్జి కృష్ణసాయితేజ, పొందూరు జూనియర్ సివిల్ జడ్జి జ్యోత్స్న మాట్లాడుతూ తల్లిదండ్రుల కష్టాలను గుర్తెరిగి చదువుపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో రణస్థలం సీఐ రామచంద్రరావు, ఎస్‌సీహెచ్ రామారావు, ఎంఈఓలు అరసాడ రవి, ముళ్ల శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ అన్నా శామ్యూల్ లంక, పొగిరి శంకరరావు, న్యాయవాదులు ఆర్.విజయ్‌కుమార్, నక్క ప్రసాదరావు, డోల కిరణ్‌బాబు, కంచరాన రమణమూర్తి, నక్క మురళీధర్, వై.ఈశ్వరరావు, కె.కృష్ణారావు, శ్రీనివాసరావు, రాము పాల్గొన్నారు.